manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 206 | గురువారం | 23.01.2025



## సమాజ చైతన్యంలో మీడియా పాత్ర కీలకం

▪ వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** సమాజాన్ని చైతన్య పర్చడంలో మీడియా పాత్ర కీలకమని వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో 'మన చౌరాస్తా' దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీసీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా ప్రతినిధులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న మోసాలు, ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మన చౌరాస్తా ఎడిటర్ ఉప్పలంచి నరేందర్, అగ్రగామి ఎడిటర్ కన్న పరశురాములు, సీనియర్ జర్నలిస్టులు కొలుపుల రవి, బొమ్మగాని శ్రీకాంత్ గౌడ్, రవీందర్, గోవర్ధన్, పోచంపల్లి రజిత శ్రీనివాస్, సలీం, చెల్లోజు నవీన్ కుమార్ పాల్గొన్నారు.

---



2 లో

## పచ్చని పల్లెల్లో పథకాల చిచ్చు

- లొల్లిలొల్లిగా గ్రామసభలు
- వడ్లకొండలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్
- కొమ్మూరి స్వగ్రామంలోనూ రగడ
- జాఫర్ గూడెం సభ బహిష్కరణ



3 లో

## నా లవర్‌నే పటాయిస్తావా?

- ఆటో డ్రైవర్‌ను కిరాతకంగా హత్య చేసిన మరో డ్రైవర్
- తన ప్రేయసితో చనువుగా ఉంటున్నందుకు ఘాతుకం



# పచ్చని పల్లెల్లో పథకాల చిచ్చు

- లొల్లిలొల్లిగా గ్రామసభలు
- వడ్లకొండలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్
- కొమ్మూరి స్వగ్రామంలో రగడ
- జాఫర్ గూడెం సమావేశం బహిష్కరణ



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభలు పచ్చని పల్లెల్లో చిచ్చుపెడుతున్నాయి. బుధవారం జిల్లాలో నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. జనగామ మండలం వడ్లకొండలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య ఘర్షణకు దారితీసింది. లబ్ధిదారులను ఎంపిక చేయడంలో అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రాధాన్యత ఇచ్చారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించడంతో ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో అక్కడున్న పోలీసులు వారికి సర్ది చెప్పేందుకు ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. సీఐ దామోదర్ రెడ్డి నేతృత్వంలో పోలీసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని ఆందోళనకారులను తరిమికొట్టారు. ఇక రఘునాథపల్లి మండలంలోని జాఫర్ గూడెంలో కూడా లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లోపించిందని, అర్హులు చాలా మంది ఉన్నా కొద్ది మందిని మాత్రమే ఎంపిక చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులు గ్రామ సభను బహిష్కరించేందుకు ఆందోళన చేపట్టారు. ఇక్కడున్న ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై నరేష్ యాదవ్ వారికి నచ్చజెప్పి శాంతింప చేశారు. ఇక డీసీసీ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి స్వగ్రామమైన మద్దూరు మండలంలోని నరసయ్యపల్లిలో నిర్వ హించిన గ్రామ సభలో కూడా లొల్లి జరిగింది. అర్హులైన గ్రామస్తులు రేషన్ కార్డు, ఇల్లు ఇవ్వాలని అడిగినందుకు గ్రామస్తులపై ఏకంగా పోలీసుల సమక్షంలో దాడులు చేశారు. లింగాలగణపురం మండలంలో నిర్వహించిన గ్రామసభను కలెక్టర్ రిజ్వాన్ బాషా పర్యవేక్షించారు. ఆయా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పరిస్థితిని సమీక్షించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు.





# అర్హులకు మంగళం.. అనర్హులకు అందలం

- కొమ్మూరి తల్లికి రేషన్ కార్డు, ఇల్లు
- ప్రభుత్వ తీరుపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆగ్రహం



**జనగామ, మన చౌరాస్తా :** అవి ఇస్తం.. ఇవి ఇస్తం అని ఎన్నో హామీలిచ్చిండ్లు.. ఏమైందని అడిగితే దాడులు చేయిస్తున్నారు.. గ్రామ సభల్లో అర్హులను పక్కనబెట్టి అనర్హులకు పథకాలు అందిస్తుండడంపై జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వంపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ అయితే చాలు అర్హత, అనర్హత అంటే ఏం లేదు. ఈ విషయమై అనేక గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో అధికారులను నిలదీస్తే అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడులు చేస్తున్నారు. పోలీసులతో బెదిరిస్తున్నారు.. ప్రజలకు అండగా ఉన్న బీఆర్ఎస్ నాయకులపై కూడా దాడులు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా కొమ్మూరి ప్రతాప్ రెడ్డి తన తల్లికి రేషన్ కార్డు, ఇల్లు ఇప్పించేందుకు తన స్వగ్రామమైన మద్దూరు మండలంలోని నరసయ్యపల్లి గ్రామంలో నిర్వ హించిన గ్రామ సభకు ఇతర గ్రామాలకు సంబంధించిన 100 మంది గుండాలతో వెళ్లి అర్హులైన గ్రామస్తులు రేషన్ కార్డు, ఇల్లు ఇవ్వాలని అడిగినందుకు గ్రామస్తులపై ఏకంగా పోలీసుల సమక్షంలో దాడులు చేశారు. అనారోగ్యంతో ఉండి ప్రశ్నించినందుకు గ్రామస్తుడు మంతెన బాల్ రెడ్డిపై గుండాలు దాడి చేస్తున్న పోలీసులు చోద్యం చూస్తూ కేసులు నమోదు చేయలేదు. వారికి అండగా నిలిచిన మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్, తదితర నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారే తప్పా గుండాల మీద ఇప్పటి వరకు కేసులు నమోదు చేయలేదు. నియోజకవర్గంలోని వడ్లకొండ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఇల్లు రాలేదని అడిగినందుకు ఓ యువకుడిపై కాంగ్రెస్ కార్య కర్తలు తీవ్రంగా దాడి చేశారు. బచ్చన్నపేట మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామసభల్లో నిలదీసినందుకు కాంగ్రెస్ కార్యకర్తలు దాడులు చేశారు. ఈ గ్రామ సభలను చూస్తే కాంగ్రెస్ ప్రజాపాలన తీరు ఏమిటో తెలిసి పోతోందన్నారు. ప్రజాస్వామ్యంలో దాడులు సరికావన్నారు. ఇలాంటి దాడులను ఖండిస్తూ అర్హులైన ప్రజలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందచేయాలని కోరుతున్నట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# రోడ్డు భద్రతపై అవగాహన

**చేర్యాల, మన చౌరాస్తా :** జాతీయ రోడ్డు భద్రత మా సోత్సవాలు సందర్భంగా బుధవారం చేర్యాల మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రిస్టోఫర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీ అసోసియేషన్ డ్రైవర్లకు వాహనదారులు రోడ్డు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలను చేరుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అతివేగం ప్రమాదకరం అని అన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ శ్రీకాంత్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ జితేందర్ రెడ్డి, కానిస్టేబుల్ విక్టోరియా, హోంగార్డ్ నరేష్, కంప్యూటర్ ఆపరేటర్ రాకేష్, నర్సిరెడ్డి, ఉస్మాన్, ఫరీద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మెల్ కాన్వెంట్ విద్యార్థులకు ఛాంపియన్ షిప్



**పాలకుర్తి, మన చౌరాస్తా :** రాష్ట్రస్థాయి క్రీడల్లో పాలకుర్తికి చెందిన కార్మెల్ కాన్వెంట్ విద్యార్థులు సత్తా చాటారు. జనవరి 10, 11న మంచిర్యాల జిల్లా గుడిపేటలో నిర్వహించిన 11వ ఇంటర్‌స్కూల్ కార్మెల్ మీట్‌లో విద్యాలయం హైస్కూల్ స్పెషల్ ఓవరాల్ ట్రోఫీ, ఛాంపియన్ షిప్‌ను గెలుచుకుంది. సత్తా చెప్పిన విద్యార్థులను బుధవారం విద్యాలయ ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయురాలు సీనియర్ లిజ్‌బెత్, వైస్ ప్రిన్సిపాల్ మెర్లిట్ సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనర్లు శ్రీనివాస్, రాణాప్రతాప్‌తో పాటు తిరుమల్, సంధ్యారాణి, జ్యోత్స్న, జగదాంబ పాల్గొన్నారు.

# నా లవర్‌నే పటాయిస్తావా?

- ఆటో డ్రైవర్‌ను కిరాతకంగా హత్య చేసిన మరో డ్రైవర్
- తన ప్రేయసితో చనువుగా ఉంటున్నందుకు ఘాతుకం

**హనుమకొండ, మన చౌరస్తా :** ఓ ఆటో డ్రైవర్ ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అదే మహిళతో మరో ఆటో డ్రైవర్ చనువుగా ఉండటాన్ని సహించలేకపోయాడు. తాను ఉంటున్న మహిళతో మరో వ్యక్తి దగ్గర కావడాన్ని జీర్ణించుకోలేక కిరాతకంగా హత్య చేశాడు. అందరు చూస్తుండగా నడి రోడ్డుపై నరికి చంపేశాడు. వివరాల్లోకెలితే.. హనుమకొండకు చెందిన మాచర్ల రాజ్కుమార్, ఏనుగు వెంకటేశ్వర్లు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వెంకటేశ్వర్లుకు ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉండగా.. అదే అమ్మాయితో మాచర్ల రాజ్‌కుమార్ ఎఫైర్ పెట్టుకున్నాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. అది మనసులో పెట్టుకున్న వెంకటేశ్వర్లు బుధవారం హనుమకొండ అదాలత్ దగ్గర మెయిన్



రోడ్డుపై అందరు చూస్తుండగా రాజ్‌కుమార్‌పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. కడుపులో అనేక కత్తి పోట్లు పడడంతో రాజ్‌కుమార్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




# డ్రగ్స్ నివారణపై పాలకుర్తిలో భారీ ప్రదర్శన

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' సమావేశం తోపాటు నివారణపై నాయకులు, విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. కిలోమీటర్ మేర ప్రదర్శన చేపట్టి మత్తు పదార్థాలకు నేటి యువత దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రెడ్డి, వరంగల్ కమిషనరేట్ నార్కోటిక్స్ బ్యూరో డిఎస్పి కె.సైదులు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ధారవత్ రాజేష్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పోలీసులు గంజాయి డీలర్లను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. డ్రగ్స్ రహిత పాలకుర్తిగా మార్చడానికి తమతో యువత ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాధనకు నిరంతరంగా శ్రమించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో గంజాయి నివారణకు పోలీసులు తరచూ తనిఖీలు నిర్వహించాలన్నారు. డ్రగ్స్ నివారణకు కట్టుబడి ఉంటామని మండల ప్రజలు, యువకులు, విద్యార్థులతో యశస్విని రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. టీపిసిసి సాంస్కృత విభాగం రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు, యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షులు క్రాంతి కుమార్, పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి, ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, తొర్రూర్ మార్కెట్ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, కొడకండ్ల మండల పార్టీ అధ్యక్షులు ధారవత్ సురేష్ నాయక్, కొడకండ్ల, పాలకుర్తి మార్కెట్ చైర్ పర్సన్ లు నల్ల అండాలు శ్రీరామ్, లావుడ్యా మంజుల భాస్కర్ నాయక్, పాలకుర్తి మండల యూత్ అధ్యక్షులు మాదాస్ హరిష్, వివిధ మండలాల యూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ విమర్శించే హక్కు బీఆర్ఎస్‌కు లేదు


**జనగామ. మన చౌరాస్తా :** పది సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు అయినా ఇవ్వని బీఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కులేదని జనగామ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కలకుంట్ల గణేష్ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీ చేయడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, జీరో కరంట్ బిల్లులు, 500లకే గ్యాస్ ఇస్తున్నామన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు కావాలనే గ్రామసభల్లో గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. వారు ఎన్ని జిక్కులు చేసినా స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీ గల్లంతు అవ్వడం ఖాయమన్నారు.



# స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ భూస్థాపితం ఖాయం : జంగిటి



**బచ్చన్నపేట,మన చౌరాస్తా :** కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలలో ఆదరణ చూడలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని, వచ్చే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీ భూస్థాపితం అవ్వడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగిటి విద్యనాథ్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. పది సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు, ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేకపోయారని, కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల రుణమాపి చేసి రైతును రాజును చేసిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, జీరో కరంట్ బిల్లులు, 500లకే గ్యాస్, ఆరోగ్యశ్రీ 10 లక్షల వరకు ఇచ్చిందన్నారు. ఇప్పుడు అర్హులందరికీ రేషన్ కార్డుల, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు తెలియజేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు వచ్చే స్థానిక ఎన్నికలలో ఓడిపోతామని లేనిపోని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. కావాలనే గ్రామసభల్లో గందరగోళం చేస్తున్నారని విమర్శించారు. తమ నాయకుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి నాయకత్వంలో రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.



# సారూ.. రక్షణ కల్పించండి

**నాభూమి ఆక్రమించి భయపెడుతున్నారు**

**రఘునాథపల్లిలో ఓ వృద్ధురాలి ఆవేదన**

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** తనకు రక్షణ కల్పించాలని, తాను తన భర్త స్మారకార్థం కొనుగోలు చేసి సాగు చేసుకునేందుకు డెవలప్మెంట్ చేస్తుండగా గ్రామస్తులు కొందరు తమను బెదిరిస్తున్నారని గోసికొండ సూర్యకళ అనే వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జాఫర్ గూడెం గ్రామంలో ఖిలాషాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1413,1420, 1421లో తమ కుటుంబ సభ్యుల పేరిట మొత్తం 11 ఎకరాల భూమిని 2019లో కొనుగోలు చేశామని తెలిపారు. ఇందులో కొంత భాగం మామిడి తోట, మరి కొంత భాగం వరి పంట ఉండగా మిగిన భాగాన్ని డెవలప్మెంట్ చేసుకునేందుకుగాను హిటాచీలతో చదును చేస్తుండగా గ్రామానికి చెందిన కొందరు రాజకీయ నాయకులు తమ భూమిని ఆక్రమించడమే కాకుండా, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికే తాను కోర్టును ఆశ్రయించగా ఓఎస్. 597/2023 నెంబర్‌తో ఇంజక్షన్ ఆర్డర్ కూడా జనగామ జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జారీ చేశారాని ఆమె తెలిపారు. ఈ భూమిని చదును చేసుకునేందుకు రెవెన్యూ అధికారుల అనుమతి కూడా తీసుకున్నట్లు ఆమె వివరించారు. తను మట్టి వ్యాపారం చేయడం లేదని, చదును మాత్రమే చేసుకుంటున్నానని అన్నారు. తాను జిలేటనస్టిక్స్ వాడుతున్నట్లు తనపై స్థానిక రాజకీయ నాయకుడు ఒకరు తమపై తప్పుడు ప్రచారాన్ని చేస్తూ పత్రికలను సైతం తప్పుదోవ పట్టిస్తున్నట్లు చెప్పారు. సదరు వ్యక్తి తమ భూమిని ఆక్రమించడమే కాకుండా గ్రామస్తులను కూడా తప్పు దోవ పట్టిస్తున్నాడని సదరు నాయకుడి మాటలు విని తమను ఇబ్బందులు గురి చేయరాదని ఆమె విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా గ్రామస్థులు వాస్తవాలు గ్రహించి తమకు సహకరించాలని కోరారు.




## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండలం కేసిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామసభలో సిద్దులగుట్ట చైర్మన్ గాలి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ఎవరైతే ఇందిరమ్మ ఇళ్లకు అప్లై చేసారో వారి వివరాలతో వెబ్ సైటు లో చెక్ చేసుకోవచ్చని, సర్వే వివరాలను తెలుసుకోవడానికి మీ మొబైల్ నెంబర్ (అప్లికేషన్ లో ఇచ్చిన నెంబర్), ఆధార్ నెంబర్, అప్లికేషన్ నెంబర్, రేషన్ కార్డు నెంబర్ ద్వారా చెక్ చేసుకోవచ్చాన్నారు. ఇందులో పేర్లు వచ్చిన వారందరిలో నుంచి నిరుపేదలకు మాత్రమే ఇండ్లు కేటాయిస్తారని తెలిపారు. తరువాత విడతల్లో మిగతా వారికీ కూడా ఇండ్లు, రేషన్ కార్డులు అందుతాయన్నారు. కార్యక్రమంలో బాల్నే రమేష్, బాల్నే రాజేష్, అజయ్ రెడ్డి, ఇమ్మడి తిరుపతిరెడ్డి, ఇమ్మడి ప్రభాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, దర్శన్ రెడ్డి, గాలి ప్రకాష్, నర్ర మహేందర్ రెడ్డి, ఎండి నన్నే, దామెర బాల నరసయ్య, వద్దుల మల్లయ్య, బాల్నేశంకరయ్య, బండెల సుదర్శన్ రెడ్డి, ఇమ్మడి అంజిరెడ్డి, మామిడాల చెన్నయ్య, తుడుం చంద్రయ్య, కంతి యాకూబ్, చింతల ఎల్లారెడ్డి, దామెర శ్రీనివాస్, యాదండ్ల శ్రీనివాసు, చెన్నూరి నారాయణ, పందిపెల్లి సిద్ధారెడ్డి, పూర్మ రాజిరెడ్డి, నర్రా రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి ‘బీఆర్ఆర్’ ఆర్థిక సాయం

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండల కేంద్రానికి చెందిన ముత్యం ఆంజనేయులు రోడ్డు ప్రమాదానికి గురికాగా రెండు కాళ్లు పనిచేయకుండా పోవడంతో మంచానికే పరిమితం అయ్యారు. పుట్టెడు దుఃఖంలో వున్న కుటుంబంలో తల్లి ముత్యం రామవ్వ దివ్యంగురాలు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ యువనేత, సామాజికవేత్త బొంగు రాజేందర్ రెడ్డి వారి కుటుంబాన్ని బుధవారం పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆంజనేయులు కూతురు పూజిత హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్గానిక్ కెమిస్ట్రీలో ప్రథమ ర్యాంక్ సాధించగా ఆమెను అభినందించి, ఉన్నత చదువులకు హామీ ఇచ్చారు. వారి కుటుంబానికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ముత్యం లక్ష్మయ్య, మాజీ జడ్పీటీసీ సిద్దప్ప మాజీ సర్పంచ్ పడిగన్నగారి మల్లేశం, ముత్యం నర్సింహాలు, సంపులపల్లి కనకాచారి పోతుగంటి కొమురల్లి, రాజిరెడ్డి, అంబటి విక్కీ గౌడ, సంఘం సభ్యులు బిక్షపతి, అశోక్, యాదగిరి, నర్సింహాలు, విజయ్ కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.






# దావోస్‌లో తెలుగు సీఎంలు

**హైదరాబాద్, మన చౌరాస్తా :** దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. తొలి రోజునే భారీ పెట్టుబడులు సమీకరించేందుకు ఎవరికి వారు వారి ప్రతినిధి బృందాలతో కలిశారు. బుధవారం పలు అంతర్జాతీయ దిగ్గజ కంపెనీల పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో పాటు అధికారులు విప్రో, సన్ పెట్రో కెమికల్స్, జేఎస్ డబ్ల్యు గ్రూప్, లోంజా గ్రూప్, మిత్రా ఎనర్జీ, టిల్ మన్ గ్లోబల్ హోల్డింగ్స్, బ్లాక్ స్టోన్ కంపెనీలతో చర్చలు జరిపారు. చర్చల అనంతరం రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి మరిన్ని కీలకమైన ఎంవోయూలు చేసుకుంది.

### నాడు ఐటీ కోసం.. నేడు ఏఐ కోసం..

ఏపీకి పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్కడ బిజీబిజీగా గడుపుతున్నారు. దావోస్ పర్యటనలో భాగంగా బుధవారం ఆయన మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ తో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దావోస్ లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం కార్యక్రమంలో వీరిద్దరు కలిసి కాసేపు మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా బిల్ గేట్స్ తో భేటీకి సంబంధించి చంద్రబాబు ‘ఎక్స్’ వేదికగా ఓ పోస్టు పెట్టారు. ‘1995లో ఐటీ కోసం.. 2025లో ఏఐ కోసం’ అంటూ ఆయన రాసుకున్నారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను టీడీపీ అభిమానులు విస్తృతంగా షేర్ చేస్తున్నారు.




## క్యాట్ లెవెల్ 2 ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ పట్టణంలో హంటర్ రోడ్డు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు క్యాట్ లెవెల్ 2కి ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సురేష్, క్యాట్ (నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్) ఆధ్వర్యంలో నిర్వహించే ఒలంపియాడ్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యా సంస్థ ఎప్పుడు వ్యక్తిగత శ్రద్ధ జాతీయ పోటీ పరీక్షల్లో ప్రోత్సహించే విధానంలో ముందుంటుందని, జాతీయ స్థాయిలో జరిగే ఈ పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఇటువంటి పరీక్షల్లో ఇంకా తమవంతు కృషి ఉంటుందని ఇందులో మొత్తంగా 111 మంది విద్యార్థులు రెండో స్థాయిలో రాణించారని అలాగే 11 మంది విద్యార్థులకు వెయ్యి రూపాయల అవార్డు సాధించినట్టు తెలిపారు. లెవెల్ 2 లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, నగదు బహుమతి పొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం రాజేశ్వర్ రెడ్డి, జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్ శివ కోటేశ్వర రావు, ప్రిన్సిపాల్ సురేష్, అకడమిక్ డీన్ రంజిత్, ఐపీఎల్ బ్యాచ్ ఇన్‌చార్జి సన్నీకుమార్, ఒలంపియాడ్ ఇన్చార్జి దీపిక, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## క్యాలెండర్ ఆవిష్కరించిన డీసీపీ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలో డీసీపీ ఆఫీసులో బుధవారం ‘తెలంగాణ గళం’ నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా ప్రతినిధులు ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు చెల్లోజు నవీన్ కుమార్, కన్న పరశురాములు, ఉప్పలంచి నరేందర్, కొలుపుల రవి, బొమ్మగాని శ్రీకాంత్ గౌడ్, రవీందర్, గోవర్ధన్, పోచంపల్లి రజిత శ్రీనివాస్, సలీం పాల్గొన్నారు.







‘మన చౌరాస్తా’ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ‘మన చౌరాస్తా’ సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812